

# కథా కౌముది

శ్రీ వికారి నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
24 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
'నా మొట్టమొదటి కథ' విభాగం విజేత

## నిజాలెవరికి కావాలి!

రాధిక మంగిపూడి
సింగపూర్

**చాలా సంవత్సరాల** తర్వాత రైలు ఎక్కాడు రవి. అంతా కొంచెం వింతగా ఉంది. ఎవరిగోల వారిది. ఇదివరకుమల్లే కొత్త పరిచయాలు, కలిసి కబుర్లు చెప్పుకుంటూ చక్కిలాలు, పులిహోరలు, పంచుకోవడాలు ఏమీ లేవు. ఎవరికి వారు చేతిలో ఒక ఫోను పట్టుకుని ఏదో నొక్కుకుంటున్నారు. కర్ణుడి కుండలాల్లా వాటితోనే పుట్టినట్లు చెవిలో వేలాడే తోకలొకటి! అవే.. ఇయర్‌ఫోన్లు.

రవికి ప్రయాణం చప్పగా ఉంది. ఏమీ తోచడంలేదు. ఏదో స్టేషన్ లో రైలు ఆగింది. ఒక ప్రయాణికుడు హడావుడిగా ఎక్కి, కూర్చోడానికి జాగా వెతుక్కుంటూ వస్తున్నాడు. ఇంతలో రవి ఎదురుగా కూర్చున్న వ్యక్తి, తలెత్తి చూసి తటాలున లేచి, "ఒరేయ్ శేఖరం" అంటూ చేతులు బారెడు చాచాడు. ఆ వచ్చినతను కూడా, "ఒరేయ్ చంద్రం" అంటూ చేతులు మూరెడు చాపాడు. ఇద్దరూ కావలించుకోవాలనుకున్నారు. కాని వారి పొట్టలు సహకరించకపోవడంతో ఆ ప్రయత్నం విరమించుకుని, రవి ఎదురుసీట్లో చతికిలబడ్డారు. "అదిరిందయ్యా చంద్రం" అనుకున్నాడు రవి. వారి పలకరింపులు, ప్రశ్నోత్తరాల పరంపర కాసేపు సాగింది. రవికి కాలక్షేపం దొరికింది. చూపు కిటికీ వైపు, చెవి వారి సంభాషణవైపుకు పడేశాడు.

"కాలేజీరోజుల్లో కథలూ, వ్యాసాలూ రాసేవాడివిగా! ఇంకా రాస్తున్నావా" అడిగాడు చంద్రం. "ఓ.. రాస్తున్నా అప్పుడప్పుడు. కానీ కాలం బట్టి మన ట్రెండు మారిపోయిందిలే. నాకు చాలా కలం పేర్లు కూడా ఉన్నాయి తెలుసా?" అన్నాడు శేఖరం గొప్పగా.

"చాలా కలం పేర్లు ఉండడం ఏమిటిరా? ఉంటే ఒకటుండాలి కానీ!" అనుమానం వ్యక్తం చేసాడు చంద్రం. అంతే! ఎప్పుడు అడుగుతాడా అని ఎదురు చూస్తున్నట్లు వెంటనే పాఠం అందుకున్నాడు శేఖరం.

"ఈమధ్య పుస్తకాలలో కథలూ, కమామీసులూ ఎవరూ చదవట్లేదురా. కాలం తీరు మారింది. కనుక కలం తీరు కూడా మారింది. వాట్సాపులు, ఫేస్బుక్కులలో పది పదిహేను పంక్తులలో రాస్తేనే అందరూ చదువుతారు. అంతకన్నా పెద్దది రాస్తే, చదవడానికి ఎవరికీ ఓపికలు లేవు సుమీ! మనమేం రాసిపడేసినా పర్లేదు. ఉదయం వాట్సాపులో తోసేస్తే, సాయంత్రానికి మనకే తిరిగి వస్తుంది. నా ఊహాశక్తికొద్దీ రోజుకో పేరుతో ఏదో ఒకటి రాసి సోషల్ మీడియాలో తోసేస్తూ ఉంటాను. ఫేస్బుక్కులో అయితే, నాకు 5000 స్నేహితులు, 3000 ఫాలోవర్స్ కూడా ఉన్నారు" అన్నాడు భుజాలెగరేసుకుంటూ.

రవికి శేఖరం మాటలు చాలా తమాషాగా అనిపించి, రెట్టింపు ఆసక్తితో వినసాగాడు. "అదేమిట్రా? ఇంతకూ ఏమేం రాసావేంటీ? అసలు ఈ బుద్ధి నీకెట్లా పుట్టింది?" అనుమానంగా అడిగాడు చంద్రం.

"అబ్బే, అసలిదంతా ఎక్కడ మొదలైందంటే, ఆ మధ్య ఒక పెద్దాయన ఫేస్బుక్కులో ఒక వ్యాసం రాశాడు. చార్మినార్ శిఖరంపై 'జహంగీర్' అనే పేరుతో ఒక వజ్రం తాపడం చేయించి ఉండేదని, అది యుద్ధంలో శ్రీ కృష్ణ దేవరాయలు వశమయిందని, తర్వాత బ్రిటిష్ వారు దానిని పట్టుకు పోయారని రాశాడు. దీనికి 2000 లైకులు 600 షేర్లు వచ్చాయి".

శేఖరం మాటలకు అడ్డుపడుతూ, "అదేమిట్రా చార్మినార్ కట్టినపుడు కృష్ణ దేవరాయలు ఎక్కడున్నాడూ? " అన్నాడు చంద్రం.
"హహహ! అదే కదా విచిత్రం. అవన్నీ వెతికి చూడడానికి అంత తీరిక ఎవడికుంది? నీ కొచ్చిన అనుమానం నాకూ వచ్చింది. కానీ అందరితో పాటు నేనూ, నాకెందుకులే అని ఊరుకున్నా. మర్నాడు ఉదయం పక్కవీధీలో ఉన్న పాతకాలం పార్కు పక్కనుండి వస్తుంటే, నాకూ ఒక ఐడియా వచ్చింది. ఆ పార్కులో ఓ మూలన ఉన్న విరిగిపోయిన బెంచీ ఒకదానికి ఫోటో తీసి, ఫేస్బుక్కులో పెట్టి, 'సర్దార్ వల్లభాయ్ పటేల్ స్వాతంత్ర్య పోరాట సమయంలో మన ఊరు వచ్చినప్పుడు నిరాహార దీక్ష చేపట్టిన స్థలం ఇదే!' అని రాసాను. ఇంకచూసుకో, నాసామిరంగా.!. ఎవరికీ తెలియని విషయం చెప్పారంటూ ఒకరు, విలువైన సమాచారం వెలికి తీసారని ఇంకొకరు, అంత గొప్ప ప్రదేశం మన ఊరిలో ఉందా అంటూ మరొకరు.. లైకులు కామెంట్స్ కుంభవృష్టి కురిసిందనుకో!" అంటూ మహదానందంగా చెప్పాడు శేఖరం.

తెల్లమొహం వేసిన చంద్రం, "అదేమిట్రా ఏడ్చినట్లుంది. ఏం రాస్తే అది నమ్మేస్తారా! నిజానిజాలు ఎవరూ ఆరా తీయరా!" అడిగాడు ఆత్రంగా.

దానికి శేఖరం ఒక వేదాంతపు నవ్వు నవ్వి, "నీ పిచ్చి గానీ నిజాలెవడికి కావాలి! అందరికీ మజాలు మాత్రమే కావాలి. ఎంటర్టైన్మెంట్ ఈజ్ ఎవ్రీథింగ్ యు నో!" అంటూ ఒక్క ముక్కలో తేల్చి చెప్పేసాడు కలికాల గీతాసారం. ఇది విన్న రవికి నోట మాట రాలేదు. తన ఆలోచనలు మెలికలు పడి మలుపులు తిరుగుతున్నాయి. అంతటితో ఆగకుండా శేఖరం, "ఎక్కడో కంబోడియాలో ఏదో గుడి ఫోటో పెట్టి , ఎవరో మన కోణార్కు గుడి అని, సూర్యకిరణాలు దూరాయని రాస్తే నమ్మేస్తారు జనాలు. నాలుగు రోజులకోసారి 'డాటర్స్ వీక్' అంటూ ఒకే మెసేజ్ తిరుగుతుంటే, అడిగే నాధుడు లేడు. ప్రతి నెలా 'ఈ నెలలో ఫలానా వారం అయిదుసార్లు వచ్చింది. కనుక ఈ నెల అదృష్టం వరిస్తుంది' అని రాస్తే ఒక్కడికీ అనుమానం రాలేదు. ఇంక సాయిబాబాదో వినాయకుడితో ఫోటో పెట్టి 20 మందికి పంపండి అని రాసి వదిలేస్తే, పంపినవాడికే తిరిగి ఇరవసార్లు వస్తుంది. ఏం? ఇందరు చేయగా లేనిది నేను చేస్తే తప్పేంటి? జనాలకి ఈ మాత్రం కాలక్షేపం లేకపోతే , ఇక మడిషికీ గొడ్డుకీ తేడా ఏటుంటాదీ" అంటూ సునకానందం వ్యక్తం చేస్తూ లా పాయింట్లు పీకాడు.

నోరెళ్ళబెట్టేసిన చంద్రానికి ఈసారి తేరుకోవడానికి రెండు నిమిషాలు పట్టింది. “సరే మిగతావారి మాట అటుంచి ఇంతకు ఇలా రాయడం వల్ల నీకొచ్చే లాభం ఏముంది?“ అని ప్రశ్నించాడు చంద్రం కాస్త సర్దుకుని.

“భలేవాడివే. మన పరపతి ఎంత పెరిగిందో తెలుసా... పైగా వేరే లాభాలు కూడా ఉన్నాయి. ఆ మధ్య ఏదో కలుపు మొక్కలు మా పెరడంతా పాకేశాయి. ఆదివారం నాడు కూడా హాయిగా పడుకోడానికి లేకుండా, మా ఆవిడ నన్ను ఆ మొక్కలన్నీ పీకమంది. నాకు ఎక్కడో కాలి, ఆ మొక్కకి ఒక ఫోటో తీసి అది ‘కకాపికా డిస్కోతుస్” అనే ఔషధజాతి మొక్క అనీ, దాన్ని రుబ్బి తలకు రాస్తే చుండ్రు క్షణంలో పోతుందనీ వ్రాసి వాట్సాపులో తోసేసా. ఇంకేముంది! సాయంత్రానికల్లా వేళ్ళతో సహా మా పెరట్లో కలుపుమొక్కలన్నీ మాయం!” అంటూ వికటాట్టహాసము చేసాడు శేఖరం.

రవికి నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు. ఎందుకంటే పోయిన నెల, తను కూడా ఆ మొక్క ఫోటో ఎక్కడో చూసి దానికోసం వెతికిన విషయం గుర్తొచ్చింది!

ఏమనుకున్నాడో కానీ చంద్రం మాత్రం స్నేహితుడి ప్రతిభకు సంబరపడిపోయి, “ఏమైనా నువ్వు అసాధ్యుడివిరా! ఇలాంటి తెలివి అందరికీ సాధ్యం కాదు. ఆ మాటకొస్తే నీకు వాట్సాపువాళ్ళు సన్మానం చేసి పారితోషికం ఇవ్వాలి ” అంటూ నవ్వేవాడు.

చంద్రం మాటలకు ఇంకా ఎక్కడ లేని ఉత్సాహం తన్నుకువచ్చేసి మళ్ళీ అందుకున్నాడు శేఖరం తన ఘనకార్యాల పరంపర వర్ణన. “ఇంకోసారి ఏమైందంటే ‘ఉల్లి చిట్కాలు” అనే శీర్షికతో రోజుకో చిట్కా వాట్సాపులో వదుల్తూ వచ్చాను. ఒకరోజు నాకు బాగా జలుబు చేసి విక్స్ తెమ్మన్నాను మా ఆవిడను. తను ఒకగిన్నెలో ఉల్లిపాయ రసం పట్టుకుని వచ్చింది. అదెందుకంటే, వాట్సాపులో చదివాను ముక్కులో కొంచెం ఉల్లి రసం వేస్తే జలుబు వెంటనే పోతుందంటూ, నా ముక్కు పట్టుకోబోయింది. నా చిట్కా నాకే రివర్స్ అవ్వడంతో వీధిలోకి పరుగు తీసాను” అంటూ బిగ్గరగా నవ్వాడు.

చంద్రం ఈసారి పొట్ట పట్టుకుని మరీ నవ్వుతూ, “నీకు బాగా అయ్యింది. అయినా అదెలా నమ్మేసిందిరా మీ ఆవిడ? ” అన్నాడు.

ఇంతలో రవి దిగాల్సిన స్టేషన్ రావడంతో తను సంచీ తీసుకుని రైలు దిగబోతుంటే శేఖరం చెప్పిన జవాబు రవి చెవిన పడింది. “మరేమనుకున్నావ్. చిట్కాల చివర, “డా. విజ్ఞాన్, యమ్ బి బి యస్, యమ్ డి, జర్మనీ” అని ఒక కలం పేరు తగిలించేశానుగా! ”

స్నేహితులు ఇద్దరూ రైలు దద్దరిల్లేలా నవ్వుతున్నారు. చంద్ర శేఖరులిద్దరి సంభాషణకి రవి బుర్ర గిర్రున తిరిగింది. గడ్డి–కొడవలి సామెత గుర్తొచ్చింది. ఒకడికి ‘పరమ బలిచక్ర’ ఒకరికి ‘వీరభోగ వాట్సాప్ రాయ’ బిరుదులు ఇచ్చెయ్యచ్చు అనుకున్నాడు.

“అవును నిజాలెవడికి కావాలి ఈ రోజుల్లో. మాటకి విలువ లేదు. వాళ్లననుకుని ఏంలాభం. మనమే జాగ్రత్తగా ఉండాలి“ అనుకుంటూ కథ చదివి నీతివాక్యం నెమరేసుకుంటున్న బడిపిల్లాడిలా రవి ముందుకు నడిచాడు. ‘నాకు ఇవన్నీ మామూలే’ అన్నట్లు రైలు ఒక కూత పెట్టి తన పట్టాలమీద ముక్కుసూటిగా సాగిపోయింది.

Post your comments